## కలుషిత నీటి సరఫరాను అరికట్టండి

మెహదీపట్నం, మార్చి 29 : ప్రజలకు కలుషితనీటి సరఫరా లేకుండా జలమండలి అధికారులు చర్యలు చేపట్టాలని నాంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మమ్మద్ మాజిద్ హుస్సేన్ అన్నారు. మల్లెపల్లిలో కలుషిత నీటి సరఫరా జరుగుతుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే జలమండలి అధికారులను ఆ ప్రాంతంలో పర్యటించాలని ఆదేశించారు. ఈ మేరకు జలమండలి మేనేజర్ మునావర్, ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్ ఖాన్‌తో కలిసి కలుషిత నీటి సరఫరా ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు జలమండలి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీటి సరఫరాను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

### సమస్యలను పరిష్కరిస్తాం..



నాంపల్లి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే మమ్మద్ మజిద్ హుస్సేన్ అన్నారు. దారుసలంలో ఎమ్మెల్యేను మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్ డివిజన్ ప్రజలు కలిసి మంచి నీటి,డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. జలమండలి జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు.

## వృద్ధుడు అదృశ్యం

చార్మినార్, మార్చి 29: ఇంట్లో నుండి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా వెళ్లిన ఘటన చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సౌమ్య వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే షబ్బీర్ అలీ (60) ఈ నెల 22న ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉగాది బాల, గురువందన పురస్కారాలు



పురస్కార గ్రహీతలతో వక్తలు సముద్రాల వేణుగోపాలచారి, అరుణ అశోక్

రవీంద్రభారతి, మార్చి 29 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాయి ఆలేఖ్య సంస్థ ఆధ్వర్యంలో శనివారం రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో విశ్వావసు నామ ఉగాది పురస్కారాలు -2025, ఉగాది బాల, గురువందన బహుకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా కేంద్ర మాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి, టూరిజం చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నల గద్దర్, శేషగిరిరావు, వెంకటేశ్‌గౌడ్, సాయి ఆలేఖ్య వ్యవస్థాపకురాలు ఉపద్రష్ట అరుణ అశోక్, తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి ఉగాది బాల, గురువందన 2025 పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తెలుగు వారందరికీ ఉగాది పర్వదినం గొప్ప పండుగని, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఉగాది పండగను నిర్వహించుకోవడం మనందరి సంప్రదాయమన్నారు. పులుపు, ఒగరు, చేదు, తీపి కలిపి ఉగాది పచ్చడి చేసుకొనే సంప్రదాయం మన తెలుగునేలపై తరతరాలు గా కొనసాగుతుందన్నారు. సాయి అలేఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు అరుణ అశోక్ ఉగాది బాల పురస్కారాలు, గురువులకు గురువందన పురస్కారాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. గురువులను, బాలలను సత్కరించుకోవడం మన సంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో గాయని మధుప్రియ, నరసింహామూర్తి, నృత్య గురువులు ప్రతిభాగౌడ్, అశ్విని ప్రియదర్శిని, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

## నల్లకుంట వీఎస్టీ వద్ద అన్నదానం



నల్లకుంట వీఎస్టీ వద్ద శనివారం మాతా వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అతిథిగా హాజరై అన్నదానంలో స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతా వాకర్స్ ఇంటర్నేషనల్ చేపట్టిన అన్నదాన కార్యక్రమం చాలా మంచిదన్నారు. ఇందులో సంస్థ అధ్యక్షుడు బొమ్మిడి శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మారం సురేశ్ తదితరులు పాల్గొన్నారు. – అంబర్‌పేట, మార్చి 29

## శ్రీలోకనాథరామాయణ కావ్యం ఆవిష్కరణ



శ్రీలోకనాథరామాయణ కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న చేస్తున్న వక్తలు

రవీంద్రభారతి, మార్చి29 : భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్, వివేకానంద సేవా సమితి, అశ్విని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త, కవి డా.మామిళ్ల లోకనాథం రచించిన శ్రీలోక నాథ రామాయణ కావ్యాన్ని ప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం నగరంలోని బీవీపీ సత్సంగ్ హాల్‌లో జరిగింది. ప్రముఖ సాహితీవేత్త మావుడూరు సూర్యనారాయణ మూర్తి సభా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వక్తలుగా విశ్రాంత రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్, వివేకానంద సేవా సమితి చైర్మన్ అనుమంతరావు , అష్టావధాని మరిగంటి కులశేఖర్, పసుపులేటి నరేంద్రకృష్ణ, నరసింహాచార్య, తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి శ్రీలోకనాథరామాయణ కావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రామాయణం అన్ని కాలాలకు, అన్ని వయస్సులవారికి ఆదర్శంగా అన్వయించుకోదగిన కావ్యం అని, ఎన్నిసార్లు చదివినా, వ్రాసినా నిత్యనూతనంగా ఉంటుందన్నారు. లోకనాథం తమ రచనలో ప్రత్యేక శైలి ప్రదర్శించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఫణింద్ర, డా.రాధశ్రీ మరుమాముల దత్తాత్రేయశర్మ, శంభుని , రఘువీర్‌ప్రతాప్, సత్యమూర్తి, డా.చీదళ్ల సీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేయాలి

హిమాయత్ నగర్ : కేంద్రం దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నాకు బీసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం హైదర్‌గూడలో టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ చేతుల మీదుగా ధర్నాకు సంబంధించిన వాల్ పో స్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు ఎర్ర శ్రీహరి, శివ కుమార్, మల్లేశ్ యాదవ్, భిక్షపతిగౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

## ఈస్ట్‌జోన్ డీసీపీని కలిసిన ఉత్సవ సమితి ప్రతినిధులు



అంబర్‌పేట, మార్చి 29: ఏప్రిల్ ఆరో తేదీన జరగబోయే శ్రీరామనవమి శోభయాత్రకు సంబంధించిన ఇంటిమేషన్ లెటర్‌ను శనివారం ఉత్సవ సమితి ప్రతినిధులు ఈస్ట్‌జోన్ డీసీపీ డా.బాలస్వామిని కలిసి అందజేశారు. ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ డా.ఎన్.గౌతంరావు నేతృత్వంలో కో-కన్వీనర్లు ఏడెల్లి అజయ్‌కుమార్, కన్నె రమేశ్‌యాదవ్, సి.కృష్ణాగౌడ్, కార్పొరేటర్ కన్నె రమేశ్‌యాదవ్, సీనియర్ నాయకులు శ్యాంరాజ్, కంచె చంద్రశేఖర్, ఎం.రవీందర్‌గౌడ్, ఎక్కాల కన్నా, బుచ్చిరెడ్డి, మైలారం రాజు, చుక్క జగన్, యశ్వంత్, పెంటంరాజు, యాదగిరి, దయాకర్‌యాదవ్, నవీన్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు డీసీపీని కలిసి శోభయాత్ర వివరాలను తెలిపారు. అంబర్‌పేట మున్సిపల్ మైదానం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఈ శోభయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున ఊరేగింపు ఉంటుందన్నారు.

## ప్రార్థన మందిరాలను సందర్శించిన డీసీపీ



రంజాన్ ప్రార్థనలను ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా జరుపుకోవాలని దక్షిణ పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ అన్నారు. శనివారం లంగర్‌హౌస్, గోల్కొండ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రార్థన మందిరాలను డీసీపీ.. ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్లు రఘు, అంజయ్యలతో కలిసి సందర్శించారు. ప్రార్థన మందిరాల వద్ద ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రార్థనలు జరుపుకోవాలని డీసీపీ సూచించారు . – మెహిదీపట్నం, మార్చి 29

## డీఆర్టీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

రవీంద్రభారతి, మార్చి 29 : నగరంలోని బషీర్‌బాగ్‌లో గల డీఆర్టీ(డేబ్ట్ రికవరీ ట్రిబ్యునల్)కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది విజయ కుమార్, ఉపాధ్యక్షుడిగా కల్యాణ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరిగా నరేశ్‌అనుగుల, కోశాధికారిగా శ్రీకాంత్, లైబ్రేరియన్‌గా తనూజ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సురేశ్, క్రాంతికుమార్, బాబు, సాయినాథ్‌రావు, జెస్సిక, మౌనిక ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా గోపిచంద్, రామేశ్వర్ కోటేలు వ్యవహరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పవన్‌కుమార్‌యాదవ్, శ్రవణ్‌కుమార్, దేశ్‌పాండే, రాఘవులు, శ్రీధర్, పూర్ణిమ, దినేశ్, రణధీర్, తదితరులు గెలుపొందిన వారిని అభినందించారు.

## ఉగాది పురస్కారాలు ప్రదానం..



ఉగాది పురస్కారాలను అందజేస్తున్న కుమారస్వామి, తదితరులు

కాచిగూడ, మార్చి 29: భారతీయ సంప్రదాయాల్లో భారతీయులకు తొలి పండుగ ఉగాది పండుగని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బ్లీస్ బర్గ్ ఫ్యూచర్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు నీలం సుఖేందర్ అధ్యక్షతన శనివారం ఉగాది సంబురాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్తలకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ముఖ్య అతిథిగా కుమారస్వామి హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా భారతీయులు వైభవంగా జరుపుకునే తొలి పండుగ ఉగాది అని, ఈ పండుగ షడ్రుచులు అయినా తీపి, కారం, ఉప్పు, పులుపు, వగరు, చేదుల కలయికతో ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డైరెక్టర్ వాసు, ఆర్కే జైన్, డాక్టర్ హరికుమార్, డాక్టర్ వినయ్‌కుమార్‌కు ఉగాది పురస్కారాలు ఆయన అందజేశారు.

## శ్రీరాముని శోభాయాత్రను విజయవంతం చేయాలి




అన్నపూర్ణనగర్‌లో శ్రీరామ నవమి పండుగ సమావేశంలో మాట్లాడుతున్న యశ్వంత్

గోల్నాక, మార్చి 29: అంబర్ పేట నియోజకవర్గానికి చెందిన శ్రీరామ శోభాయాత్ర సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న నిర్వహించే శ్రీ రాములోరి శోభయాత్రను జయప్రదం చేయాలని శోభయాత్ర నిర్వాహక కమిటీ ప్రతినిధి యశ్వంత్ కోరారు. శనివారం అంబర్ పేట డివిజన్, అన్నపూర్ణనగర్‌లో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఏప్రిల్ 6న సాయంత్రం 3గంటలకు అంబర్‌పేట మున్సిపల్ మైదానం నుంచి ప్రారంభమయ్యే శోభయాత్ర హనుమాన్ టెక్కీ వరకు కొనసాగుతోందని తెలిపారు. శోభాయాత్రకు హిందూ బంధువులు, యువకులు వేలాదిగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాగభూషణం చారి, హరీశ్, నరేశ్‌గౌడ్, శ్రీకాంత్, మైలారం రాజు, నరసింహచారి, శశిధర్ పాల్గొన్నారు.



ఏప్రిల్ 6న నిర్వహించే శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. శనివారం డివిజన్‌లోని లాల్ బంగ్లా, బండల్ బస్తీ, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి శోభాయాత్రను విజయవంతం చేయాలని కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళి, భీమ్‌రాజ్, సంతోశ్, రవి యాదవ్, శ్రీను, లావణ్య, తార, రమాదేవి, తదితరులు, పాల్గొన్నారు. – కాచిగూడ, మార్చి 29

## ప్రముఖ కవి రామకృష్ణ శర్మకు గౌరవ డాక్టరేట్ ప్రదానం..



అనంత రామకృష్ణ శర్మకు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రతినిధులు

కాచిగూడ,మార్చి 29: గత 15 ఏళ్లుగా సాహితీ రంగంలో విశేషంగా కృషి చేసిన ప్రముఖ కవి వేమూరి అనంత రామకృష్ణ శర్మకు తమిళనాడులోని ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం కాచిగూడలో రామకృష్ణ శర్మ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే రచనలపై ఎంతో ఆసక్తి కనబరిచినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సాహితీ రంగంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను ఈ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ డాక్టరేట్‌తో తనపై మరింత బాధ్యత పెరిగిందని, సమాజంలో ప్రతి ఒక్కరూ సంస్కృతి, సామాజిక సేవలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అనంత రామకృష్ణ శర్మకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.


## దశరథ లక్ష్మికి అవార్డు అందజేత..



కాచిగూడ, మార్చి 29: కోటి సెల్ఫీ ప్రోగ్రాంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకున్న లబ్ధిదారులతో నేరుగా తెలంగాణ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి దశరథ లక్ష్మి 42,250 మంది లబ్ధిదారులతో సెల్ఫీ ఫొటోలు దిగి, ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించారు. ఈ సందర్భంగా శనివారం ఢిల్లీ భవన్‌లో కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ చేతుల మీదుగా దశరథ లక్ష్మి అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు బైజా యాంట్ పాండా, సంఘటన మంత్రి బీఎల్ సంతోశ్, జాతీయ అధ్యక్షుడు వనతి శ్రీనివాస్ పాల్గొన్నారు.


## నీరా కేఫ్ రద్దు చేస్తే ఆందోళన చేస్తాం..

### భీమగౌని కృష్ణ గౌడ్



కాచిగూడ, మార్చి 29: తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గౌడన్నల ఉపాధి కోసం ప్రవేశపెట్టిన నీరా కేఫ్‌ను రద్దు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని తెలంగాణ గౌడ సంఘం జాయింట్ సెక్రటరీ, కాచిగూడ జమాల్ బస్తీ గౌడ సంఘం అధ్యక్షుడు భీమగౌని కృష్ణాగౌడ్ హెచ్చరించారు. శనివారం నింబోలి అడ్డ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో నీరా కేఫ్‌తో గౌడ కులస్తులు ఆర్థికంగా ఎదిగారని, అవి తొలగిస్తే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. నీరా కేఫ్‌ను ఎత్తివేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కుల, ఆదాయ ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయాలి



అంబర్‌పేట మండల కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోల్నాక, మార్చి 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలని అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు శనివారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వీరా బాయిని కలసి వినతి పత్రం అందజేశారు. దీనికి ప్రభుత్వం వచ్చే నెల 5వ తేదీ చివరి గడువు ప్రకటించిందని , అందుకు కావలసిన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. అధికారులు స్పందించి వెంటనే సంబంధిత ధ్రువ పత్రాలు జారీ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముదిరాజ్, నరేంద్ర ముదిరాజ్, బొట్టు మహేశ్ గౌడ్, సురేశ్ ముదిరాజ్, దశరథ్, సాయి, రాజేశ్, ఫిరోజ్, కాశి, రోహిత్, తదితరులు ఉన్నారు.

## సకాలంలో సర్టిఫికేట్లు అందజేత

### అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి


అంబర్‌పేట, మార్చి 29: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నవారికి కులం, ఆదాయం సర్టిఫికేట్లను ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో అందజేస్తున్నామని అంబర్‌పేట తహసీల్దార్ ఎం.వీరాభాయి తెలిపారు. గత వారం రోజుల నుంచి కులం, ఆదాయం సర్టిఫికేట్ల కోసం రద్దీ పెరిగిందన్నారు. ఒకటి, రెండు రోజుల్లోనే సర్టిఫికేట్లను జారీ చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ అయి తే మాత్రం ఇంటికి వెళ్లి విచారణ చేసిన తర్వా త జారీ చేస్తున్నామని చెప్పారు. ఎవరు కూ డా ఆందోళన చెందవద్దని, తమ సిబ్బంది ఎ క్కువ సమయం కేటాయించి సర్టిఫికేట్లు పెం డింగ్ లేకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. అయితే పగటిపూట సర్వర్ డౌన్ ఉండడంతో కొద్దిగా ఆలస్యం అవుతుందని, అయినా త మ సిబ్బంది సమయం తీసుకొని అన్ని సర్టిఫికేట్లను అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. సర్టిఫికేట్ల కోసం దరఖాస్తు చేసుకునేవారు బ్రోకర్లను నమ్మొద్దన్నారు. అలాగే మీసేవా నిర్వాహకులు కూడా దరఖాస్తుదారుల నుంచి చార్టర్‌లో తెలిపిన ప్రకారమే డబ్బులు తీసుకోవాలని, ఎక్కువ తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దానికి అఫిడవిట్ అవసరం లేదని చెప్పారు. తాము అడిడితే తప్పా అఫిడవిట్ పెట్టాల్సిన అవసరం లేదని ప్రజలకు సూచించారు. సర్టిఫికేట్ల జా రీలో ఏ ఇబ్బంది ఉన్నా లేదా సిబ్బంది ఎవరైనా సతాయిస్తే నేరుగా తనను కలువొచ్చని వివరించారు. ఏప్రిల్ ఐదో తేదీ వరకు సమ యం ఉన్నందున దరఖాస్తుదారులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, అందరికి కూడా సమయంలోపలే సర్టిఫికేట్లు జారీ చేస్తామన్నారు.

## డాక్టరేట్ అందుకోవడంతో బాధ్యత మరింత పెరిగింది



సినీ, లలిత సంగీతగాయనీ వేమూరి మంజుల చేసిన కృషికి గాను తమిళనాడు రాష్ట్రంలోని హోసూరుకు చెందిన ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ఆమెకు ప్రదానం చేసింది. శనివారం ఆమె మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే సంగీతం పట్ల మక్కువతో శాస్త్రీయ, లలిత సంగీతం నేర్చుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గౌరవ డాక్టరేట్ అందుకోవడం పట్ల తనలో బాధ్యత మరింతగా పెరిగిందని పేర్కొన్నారు. – తెలుగు యూనివర్సిటీ

## అమావాస్య అన్నదానం



అబిడ్స్, మార్చి 29: అమావాస్య సందర్భంగా, కోఠిలోని రాణి పార్క్ సమీపంలో ఉన్న శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. అమావాస్యను పురస్కరించుకొని ప్రతి నెల అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రవి, శేఖర్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి



అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి పుష్పలతకు దరఖాస్తులను అందజేస్తున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్

అబిడ్స్, మార్చి 29: అర్హులైన వారందరికీ తక్షణమే రేషన్ కార్డులు జారీ చేయాలని జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ కోరారు. డివిజన్ పరిధిలోని వందమంది రేషన్ కార్డు దరఖాస్తులను పౌరసరఫరాల శాఖ నాల్గవ సర్కిల్ అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి పుష్పలతకు అందజేశారు. దరఖాస్తులను పరిశీలించి వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాకేశ్ జైస్వాల్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల కోసం ఎంతోమంది దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నారని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరులో జాప్యం జరు గుతుండడంతో ప్రభుత్వం ప్రతి పథకానికి రేషన్ కార్డు తప్పనిసరి చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తుల విచారణ జరిపి వెంటనే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## హమాలీలకు లైసెన్సులు రెన్యూవల్ చేసి, యూనిఫాంలు ఇవ్వాలి



మెహిదీపట్నం, మార్చి 29 : గుడిమల్కాపూర్ మార్కెట్‌లో హమాలీలకు లైసెన్సులు రెన్యూవల్ చేయాలని, రెండు జతల యూనిఫాంలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి విఠల్ డిమాండ్ చేశా రు. ఈ మేరకు శనివారం గుడిమల్కాపూర్ మార్కెట్లో హమాలీల యూనియన్ ఆధ్వర్యంలో మార్కెట్ చైర్మన్ మల్లేశ్‌కు వినతి పత్రం అం దజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ మార్కెట్లో పని చేసే హమాలీలకు 10 సంవత్సరాల క్రితం ఇచ్చిన యూ నిఫాంలు, లైసెన్సులే ఉన్నాయని, మళ్లీ కొత్తగా ఇవ్వలేదని, లైసెన్సులని రెన్యూవల్ కూడా చేయలేదన్నారు. హమాలీ కార్మికులకు ఒక బోర్డు అనేది ఏర్పాటు చేసి వాళ్లకు బోర్డు నుంచి సంక్షేమ పథకాలు, సంక్షేమ, ఆర్థిక సహకారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నా, అలా చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో హమాలీ యూ నియన్ జిల్లా కార్యదర్శి రాములు, నరసింహ చారి పాల్గొన్నారు

## నేటి నుంచి ఉగాది పద్య నాటకోత్సవాలు

బంజారాహిల్స్, మార్చి 29 : ఫిలింనగర్‌లోని ఫిలించాంబర్ రామానాయుడు కళామండపంలో ఆదివారం నుంచి ఐదురోజుల పాటు ఉగాది నాటకోత్సవాలు నిర్వహించనున్నారు. చుక్కపల్లి శంకర్‌రావు శత జయంతి సందర్భంగా ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీ సహకారంతో నిర్వహించే నాటకోత్సవాల్లో భాగంగా 30న, శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక నాటకం, 31న బాలనాగమ్మ జానపద నాటకం, ఏప్రిల్ 1న సత్య హరిశ్చంద్ర నాటకం, 2న భక్త చింతామణి నాటకం, 3న కురుక్షేత్రం నాటకాలను ప్రదర్శిస్తారని నిర్వాహకులు పొత్తూరి వెంకట సుబ్బారావు తెలిపారు. రంగస్థల నాటకాలపై నేటితరానికి అవగాహన ఉండడం కోసం, కళాకారులను ఆదుకునే లక్ష్యంతో నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఆయా నాటకాలను ప్రదర్శిస్తారని తెలిపారు.